క్లుప్తంగా

రెండు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లు మంజూరు



కళాశాలకు చేరిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లు

సాలూరు: పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రెండు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లు మంజూరై కళాశాలకు చేరాయని ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. ఒక్కో వాటర్ ప్లాంట్‌కు సుమారు 5 లక్షల 20 వేల రుపాయిలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఒక్కో వాటర్ ప్లాంట్ ద్వారా 12 కుళాయిలు చొప్పున బాలురు, బాలికలకు మొత్తం 24 కుళాయిలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

650 పశువులకు టీకాలు



నారాయణపురంలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యశాఖ సిబ్బంది

బలిజిపేట: మండలంలోని నారాయణపురంలో 650పశువులకు ముందస్తు చర్యగా గాలికుంటువ్యాధి టీకాలు వేశారు. మండల పశువైద్యశాఖ అధికారి గణేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పశువులకు వ్యాధి లక్షణాలు సోకే అవకాశాలు ఉన్నందున ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందస్తుగా టీకాలు వేసే కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. నోటివెంట చొంగకారడం, నాలికపై బొబ్బర్లు, అధిక జ్వరం, మేత తీసుకోకపోవడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం, కాలిగిత్తల మధ్య పుళ్లు వంటివి గాలికుంటు వ్యాధి లక్షణాలని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌తో విద్యార్థి మృతి



సీహెచ్ సుశాంత్ (ఫైల్)

సీతానగరం: మండలంలోని జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యాలయంలో పదోతరగతి చదువుతున్న విద్యార్థి సీహెచ్ సుశాంత్ సోమవారం విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ప్రిన్సిపాల్ పి వెంకటనాయుడు అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధితో అనారోగ్యానికి గురైన సుశాంత్ రెండు నెలలుగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. విద్యార్థి మృతి పట్ల ప్రిన్సిపాల్ వెంకటనాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది, సహచర విద్యార్థులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

దంత సమస్యలపై అవగాహన అవసరం



బలిజిపేట పీహెచ్‌సీ నుంచి నిర్వహించిన ర్యాలీ

బలిజిపేట: దంతాల పరిరక్షణ ఎంతో అవసరమని బొబ్బిలి సీహెచ్‌సీ దంత వైద్యురాలు లోకముద్ర తెలిపారు. ప్రపంచ నోటిదినోత్సవం సందర్భంగా బలిజిపేట పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. దంత సమస్యలపై ప్రజలలో అపోహలు ఉన్నాయని వాటిని తొలగించుకోవాలని హితవు పలికారు. పళ్లు, దంతాలకు సంబంధించిన జాగ్రత్తలపై తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి మహీపాల్, కిరణ్మయి, సీహెచ్‌ఓ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

గరుగుబిల్లి: విద్యార్థి దశ నుంచే సేవా భావాన్ని అలవర్చుకోవాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ బి.ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని తోటపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వారోత్సవాల్లో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు, గ్రామస్తులకు అవగాహన కల్పించడంతో పాటు వారితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలో స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎ.సింహాచలమమ్మ, కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు, జట్టు ట్రస్టీ డి.పారినాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి బి.హరిరామ్‌కుమార్, ఆర్.రాజ్యలక్ష్మి, బి.నర్సింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎండ ప్రచండం

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



పార్వతీపురంటౌన్:

ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. రాత్రి కొంతమేర చలి ఉంటున్నా ఉదయం వేళల్లో భానుడు విజృంభిస్తున్నాడు. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రత పెరిగింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి పట్టణంలో నమోదైన ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే 36, 37, 38, 36, 37 క్రమంగా పెరుగుతుండడాన్ని గమనించవచ్చు. మంగళవారం పగటి ఉష్ణోగ్రత 37 డిగ్రీలుగా నమోదైంది. కాగా ఈనెల 30వ తేదీ నాటికి 40 డిగ్రీలకు చేరుకునే అవకాశముందని నిపుణులు పేర్కొంటున్నారు.

జాగ్రత్తలు పాటించాల్సిందే..

వేసవిలో సాధారణంగా అతిసార ఎక్కువగా ప్రబలుతుంది. నివారణ కోసం సురక్షితమైన నీటిని మాత్రమే తాగాలి. బావులు, బోర్లు, చెరువు, కాల్వ నీటిలో క్లోరిన్ కలిపిన తర్వాత ఉపయోగించాలి. వాంతులు, నీళ్ల విరేచనాలు అవుతుంటే ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తాగించాలి. ఇంట్లో లభించే గంజి, పలచని మజ్జిగ, కొబ్బరి నీళ్లు తాగించాలి. పిల్లలకు విరేచనాలు అయితే తల్లిపాలు ఇస్తూనే ఉండాలి. వంట గదిలో ఆహార పదార్థాలు, కోసిన పండ్లు, కూరగాయల ముక్కలపై దుమ్ము, ధూళి, ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

వడదెబ్బ లక్షణాలు..

ఎండలో అధికంగా తిరగడం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బ సోకుతుంది. తలనొప్పి, తల తిరగడం, ఎండిపోయిన చర్మంతో ఎక్కువ జ్వరం కలిగి ఉండడం, ఫిట్స్, మానసిక ప్రవర్తన, చమట, వికారం, ఎర్రబడిన చర్మం, వేగవంతమైన శ్వాస, పాక్షిక అపస్మారక స్థితిలోకి వెళ్లడం తదితర లక్షణాలు ఉంటాయి. ఎండలో బయట తిరగాల్సి వస్తే ద్రవ పదార్థాలను అధికంగా తీసుకోవాలి. ఉష్ణోగ్రత నుంచి ఉపశమనం కలిగించే చర్యలు పాటించాలి. తేలిక పాటి, నూలు దుస్తులు ధరించాలి.

జాగ్రత్తలు పాటించాల్సిందే..

సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం ఎండలో తిరగకూడదు. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే ఉప్పు కలిపిన మజ్జిగ, పండ్ల రసాలు తాగాలి. తెల్లని దుస్తులు ధరించాలి. వేసవిలో మద్యం తాగడం వల్ల రక్తనాళాలు వ్యాకోచించి ఎక్కువ చమట వచ్చేలా చేస్తాయి. అది విషమ పరిస్థితికి దారి తీస్తుంది. ఇంటి ఉష్ణోగ్రతలు తగ్గించేందుకు కిటికీలు, తలుపులు తెరవాలి.

గాలి తగిలే దుస్తులు వాడాలి



ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. శరీరానికి గాలి తగిలే దుస్తులు వాడాలి. రోజుకు అవసరాన్ని బట్టి పెద్దలు 6 నుంచి 8 లీటర్ల నీటిని తీసుకోవాలి. పిల్లలను ఎండలో ఆడకుండా చూడాలి. బయటి ఆహారాన్ని తీసుకోకపోవడం మంచిది.

– డా. బి.వాగ్దేవి,
జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్,
పార్వతీపురం

ఆలస్యమైతే అనుమతి లేదు

- చీఫ్ సూపరింటెండెంట్ రేణుక



మాట్లాడుతున్న జీజే కాలేజీ ప్రిన్సిపాల్ బి.రేణుక, చీఫ్ సూపరింటెండెంట్ తవిటినాయుడు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్‌కాలేజీలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు నిర్దేశించిన సమయం కన్నా ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని ప్రిన్సిపాల్-పరీక్షల చీఫ్ సూపరెంటెండెంట్ బి రేణుక స్పష్టం చేశారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణపై మంగళవారం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆమె మాట్లాడుతూ మండలంలోని గిరిజన ప్రతిభా విద్యాలయం, స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జనరల్‌తో పాటు వృత్తివిద్యా కోర్సులకు సంబంధించిన రీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల్లో16 సీసీ కెమెరాలు ఈ సందర్భంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరిక్ష కేంద్రం ప్రాంగణమంతా 144 సెక్షన్ అమలు చేసినట్లు తెలియజేశారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు అత్యవసర వైద్య సేవలందించడానికి స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారుల పర్యవేక్షణలో వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసామని తెలియజేశారు. సమావేశంలో జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయంలో కాలేజీ ప్రిన్సిపాల్-పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ పోల వెంకటనాయుడు మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలని కోరారు. డిపార్ట్‌మెంటల్ అధికారిగా ఎస్.భాస్కరరావును నియమిస్తూ ఇంటర్మీడియట్ బోర్డు నియామక ఉత్తర్వులు అందజేసినట్లు తెలియజేశారు.

ప్రతి వస్తువు కొనుగోలుకు బిల్లు ఇవ్వాల్సిందే



సమావేశంలో మాట్లాడుతున్న కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ సభ్యులు

పార్వతీపురంటౌన్: ప్రతి వస్తువు కొనుగోలుపై వినియోగదారులకు బిల్లు ఇవ్వాల్సిందేనని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం సభ్యుడు జామి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం పట్టణంలోని ఆ సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారునికి హక్కుల గురించి అవగాహన కల్పించేందుకు తగు కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. వస్తువు ధర, తూకం, నాణ్యత, బిల్లు కచ్చితంగా పాటించేలా ఇటు వ్యాపారులు, అటు వినియోగదారుల్లో సంబంధిత శాఖ అధికారుల సహాయ సహకారాలతో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. వినియోగదారులుకు వారి హక్కులపై అవగాహన లేకపోవడంతో వస్తు కొనుగో లులో మోసానికి గురవుతున్నారని, అందుకే వినియోగదారులకు తమ హక్కుల అవగాహన కల్పించేందుకు అయామార్గాల్లో కార్యచరణ రూపొందించమన్నారు. అలాగే మోసపోయిన వినియోగదారుల పట్ల నిలబడి ఉచిత న్యాయసేవలు అందించి న్యాయం చేస్తామన్నారు. ముఖ్యంగా వినియోగదారుడు తన హక్కులు గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. దీనికోసం తమ సంస్థ అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో చందక అనిల్ కుమార్, వి.దాలినాయుడు, వై శ్రీనివాస్ నాయుడు, కె.నారాయణ రావు, బంకురు ప్రకాశరావు, కొత్త సన్యాసిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం అతిక్రమిస్తే చర్యలు

- మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

పార్వతీపురం టౌన్:

పట్టణంలో ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే అపరాధ రుసుముతో పాటు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారస్తులు అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. క్లీన్ పార్వతీపురంగా తీర్చిదిద్దేందు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్లు చెప్పారు. వ్యాపారస్తులు వాటిని విక్రయించినట్లతే జరిమానా విధించడంతో పాటు సరుకు స్వాధీనం చేసుకుంటామన్నారు. పలుమార్లు పట్టుబడితే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఇళ్ల వద్దకే మెరుగైన వైద్యసేవలు

- పీహెచ్‌సీ వైద్యాధికారిణి సాహితి



గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సాహితి

పార్వతీపురంటౌన్:

ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతి గ్రామంలో రోగుల ఇళ్ల వద్దనే మెరుగైన వైద్యసేవలు అందిసస్తున్నట్లు వెద్యాధికారిణి సాహితి చెప్పారు. ఈ మేరకు మండలంలోని డీకేపట్నం గ్రామంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి 15రోజులకొకసారి గ్రామంలో నిర్వహించే వైద్యశిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో నిర్వహించే ఈ వైద్యశిబిరంలో 8రకాల వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నామని, 66 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని,రోగికి అవసరమైన మేరకు అందజేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న రోగుల వద్దకు ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచి స్పందన లభిస్తోందని సంతృప్తి వెలిబుచ్చారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

నేడు మెగా ఉచిత వైద్యశిబిరం

బలిజిపేట: మండలంలోని నారాయణపురంలో బుధవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ రామకృష్ణనాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా రాగోలులోని జెమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఎంపీపీ పాఠశాల వద్ద ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వైద్య నిపుణులు శిబిరంలో సేవలు అందిస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న న్యాయమూర్తి విజయ్‌రాజ్‌కుమార్

పాలకొండ రూరల్: మహిళలు నేటి సమాజంలో ధైర్యంగా ముందడుగు వేయాలని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఆగ్గాల విజయ్ రాజ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా న్యాయసేవా సంస్థ నేతృత్వంలో ఇటీవల వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం స్థానిక న్యాయస్థానంలో న్యాయమూర్తి బహుమతులు అందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవత ఉత్సవాలు



గ్రామదేవతకు పూజలు చేస్తున్న భక్తులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దిగువమండ గ్రామంలో గ్రామదేవత అంగరాడతల్లి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరిరోజు అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

జగనన్న కాలనీ ఇళ్లకు ఉచితంగా విద్యుత్ మీటర్లు



జగనన్న కాలనీ ఇంటికి మీటర్లు అమరుస్తున్న విద్యుత్ సిబ్బంది

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేటలో జగనన్న కాలనీ ఇళ్లకు ఉచితంగా విద్యుద్దీకరణ పనులు చేపడుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి.సూర్యనారాయణ తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు పథకంలో భాగంగా గ్రామాల్లో జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఉచితంగా సర్వీసువైరు. మీటరు, బోర్డులు మంజూరుచేసిందన్నారు. ఈ మేరకు అప్పయ్యపేట జగనన్న కాలనీలో ఏపీఈపీడీసీఎల్ ఏఈ సోమేశ్వరరావు పర్యవేక్షణలో విద్యుత్ శాఖ సిబ్బంది మీటర్లు అమరుస్తున్నట్లు తెలిపారు. పెదభోగిలి సచివాలయం పరిధిలో ఉన్న జగనన్న కాలనీలో విద్యుత్ కనెక్షన్లు త్వరలో అమరుస్తారని తెలిపారు. జగనన్న ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బి.కుసుమ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఫలించిన ఇంటికోసం..గంట



సమావేశంలో పాల్గొన్న అధికారులు

సీతానగరం: మండలంలో అమలు చేస్తున్న ఇంటి కోసం గంట కార్యక్రమంతో మంచిఫలితాలు వస్తున్నాయని హౌసింగ్ ఏఈ జానకీరాం, వర్క్‌ఇన్‌స్పెక్టర్ కృష్ణ అన్నారు. ఉన్నతాధికారుల పిలుపు మేరకు గృహనిర్మాణాలను లబ్ధిదారులతో వేగవంతం చేయించేందుకు 'ఇంటికోసం గంట' కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి ఫీటర్ నిర్దేశించారు. ఈ సందర్భంగా వర్క్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి పర్యవేక్షణలో వారంలో ఒకరోజు గృహనిర్మాణ, పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ సహాయకుడు,, వెలుగు సీసీ, తాగునీటి సరఫరా విభాగానికి చెందిన అధికారులతో జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలు వేగవంతం చేయించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో చెల్లంనాయుడువలస జగనన్న కాలనీలో ప్రారంభించిన ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని కోరినట్లు చెప్పారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి ప్రభుత్వం రూ.35 వేల రుణం సమకూరుస్తుందని ధైర్యం చెప్పారు. ఇంటి పని పూర్తయిన తరువాత వాయిదాల పద్ధతిన రుణం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ గృహనిర్మాణం, ఇంజినీరింగ్ సహాయకులు, లబ్ధదారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

సాలూరు: సీసీ కెమెరాల నీడలో బుధవారం నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు జరగనున్నాయి. బుధవారం ఇంగ్లిష్ పేపర్‌తో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, సత్యసాయి, వాసవి కళాశాలలు, పీఎన్‌బొడ్డవలస కళాశాల కేంద్రాల్లో ఈ పరీక్షలు జరగనున్నాయి. ఇందు కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 21 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయని డీవీఈఓ మంజులవీణ తెలిపారు. సీసీ కెమెరాల లైవ్ టెలికాస్టింగ్ జరుగుతుందని, అన్ని కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుండి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అర్ధ గంట ముందుగానే చేరుకోవాలని ఆమె సూచించారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



సీతారాముల కల్యాణానికి సిద్ధమైన భక్తులు

సీతానగరం: మండలంలోని గుచ్చిమిలో నిర్మించిన ఆలయంలో మంగళవారం సీతారాముల కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు భజన మండలి సభ్యుడు బి.శంకరరావు మాట్లాడుతూ గ్రామంలో పెద్దల సమక్షంలో నిర్మించుకున్న ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో భక్తులంతా ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఉదయం నుంచి పూజా కార్యక్రమాలను ప్రారంభించాకని, బుధవారం సీతారాముల కల్యాణం నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాదాల వితరణ జరుగుతుందని చెప్పారు. కల్యాణోత్సవంలో వేలాది మంది భక్తులుపాల్గొననున్నందున, రాత్రి పూట భజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: వలసలు నివారించేందకు గ్రామస్థాయిలో అమలు చేస్తున్న ఉపాధి పనుల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. మండలంలోని గోపాపురంలో జరుగుతున్న అంపిలిబట్టి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పనులకు హాజరైన వేతనదారుల మస్తర్లను తనిఖీ చేశారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున వృద్ధులు, దీర్ఘకాల ఆరోగ్య సమస్యలతో అవస్థలుపడుతున్న వారితో పనులు చేయించొద్దని సిబ్బందికి సూచించారు. క్షేత్ర సహాయకులు సమయపాలన పాటించాలని, నిర్దేశిత సమయాల్లో పనులు కచ్చితంగా జరిగేలా చూడాలన్నారు.

వైభవంగా అమ్మవార్ల జాతర



తామరఖండిలో ఇళ్లు, పశువుల శాలలపై అక్షింతలు వేస్తున్న సిరిమానుపై అధిష్ఠించిన పూజారి



అమ్మవారితో తిరువీధిలో పాల్గొన్న ఘటాలు

సీతానగరం: మండలంలోని తామరఖండి, బూర్జ గ్రామాల్లో మంగళవారం ఆమ్మవార్ల జాతర ఘనంగా జరిగింది. తామరఖండి గ్రామంలో చిన్నమ్మవారి జాతరను పురస్కరించుకుని సాయంత్రం సిరిమానోత్సవంలో భాగంగా సిరిమానుపై అధిష్ఠించిన పూజారి పురవీధుల్లో తిరువీధి చేశారు. మేళతాళాలు, అమ్మవారి ఘటాలతో పూజారి తిరువీధిచేసి ఉత్సవాలు నిర్వహించారు. అలాగే కొత్తబూర్జ, పాత బూర్జ గ్రామాల్లో పెద్దమ్మవారి జాతరను పురస్కరించుకుని వందలాది ఘటాలతో అమ్మవారిని ఊరేగించారు. బుధవారం ఉదయం అనుపోత్సవం జరగనుంది. ఆయాగ్రామాలు భక్తులతో కిటకిటలాడాయి. పండగలు జరుగుతున్న గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై కె.నీలకంఠం ఆధ్వర్యంలో సిబ్బంది ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు.